

హుండీ ఆదాయం లెక్కింపు

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కంఠంరాజు కొండూరులోని మహంకాళీ గుడి హుండీ లెక్కింపు బుధవారం జరిగింది. రూ.18,51,807 ఆదాయం వచ్చినట్టు ఈఓ వెంకటరెడ్డి తెలిపారు.



కోర్టు ఆవరణలో స్వచ్ఛతాహీ సేవ

వినుకొండ(నూజెండ్ల): స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జడ్జి రామ్మోహన్ బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు.



29న ఇంద్రకీలాద్రిపై గిరి ప్రదక్షిణ

విజయవాడ: లోక కళ్యాణార్థం, భక్త జన శ్రేయస్సును కాంక్షిస్తూ ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ 29వ తేదీ శుక్రవారం జరుగుతుందని దుర్గగుడి ఈవో భ్రమరాంబ తెలిపారు.

న్యూస్‌రీల్

పశువైద్య సేవా రథాల్లో ఉద్యోగాలు

గుంటూరు మెడికల్: పశు ఆరోగ్య సేవా రథాల్లో ఖాళీగా ఉన్న డాక్టర్లు, డ్రైవర్ల పోస్టుల భర్తీకి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పశు ఆరోగ్య సేవా రథాల జిల్లా మేనేజర్ పాతపాటి బాల చంద్రుడు తెలిపారు. డాక్టర్ పోస్టులకు బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ విద్యార్హత ఉండాలన్నారు. డ్రైవర్ పోస్టులకు మూడు సంవత్సరాల అనుభవం, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు పూర్తి వివరాలకు మొబైల్ నంబర్ 90328 76888లో సంప్రదించాలని కోరారు.

30న జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లాస్థాయి శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ నిర్వహణకు సంబంధించి ఈ నెల 30న జిల్లాలోని అన్ని యాజమాన్యాల్లో పని చేస్తున్న సైన్స్ ఉపాధ్యాయులకు జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఈఓ పి.శైలజ బుధవారం తెలిపారు. గుంటూరు పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్షా భవన్‌లో శనివారం ఉదయం 9 గంటలకు జరగనున్న సదస్సుకు అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల నుంచి ఒక సైన్స్ ఉపాధ్యాయుడు చొప్పున హాజరు కావాలని ఆదేశించారు. ఆరోగ్యం-సంక్షేమం కోసం పర్యావరణ వ్యవస్థలను అర్థం చేసుకోవడం ప్రధాన అంశమని తెలిపారు.

ఎస్పీ వకుల్ జిందాల్‌కు జాతీయస్థాయి అవార్డులు




బాపట్లటౌన్: ఎస్పీ వకుల్ జిందాల్‌ను కేంద్రప్రభుత్వ స్కాచ్ అవార్డులు వరించాయి. ఆపరేషన్ పరివర్తనలో భాగంగా జిల్లాలో సారాపై ఉక్కుపాదం మోపడమే కాకుండా సారా తయారీదారులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించడం, యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా సంకల్పం కార్యక్రమం ద్వారా చర్యలు చేపట్టడంతో కేంద్ర ప్రభుత్వం రెండు స్కాచ్ ఆర్డర్ ఆఫ్ మెరిట్ అవార్డులకు ఎస్పీని ఎంపిక చేసింది. ఈ అవార్డులను త్వరలో ఎస్పీ అందుకోనున్నారు.

నేడు 'మిలాద్ ఉన్ నబీ' వేడుకలు




పాత గుంటూరు: విశ్వగురువు మహా ప్రవక్త జన్మదినం పురస్కరించుకొని గురువారం 'మిలాద్ ఉన్ నబీ' పండుగను ఘనంగా నిర్వహించనున్నట్లు హజ్రత్ సయ్యద్ షా మొహియుద్దీన్ బాద్ షా ఖాదిరి అవులియా రహ్మా దర్గా పీఠాధిపతులు సయ్యద్ షా సులేమాన్ ఖాదిరి తెలిపారు. బుధవారం నల్లచెరువు ఎత్తు రోడ్డు సెంటర్‌లోని దర్గా ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పండుగ సందర్భంగా నగరంలోని ప్రధాన వీధుల్లో భారీ ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు దర్గా నుంచి ఊరేగింపు ప్రారంభమవుతుందన్నారు. సాయంత్రం 6 గంటలకు ముస్లిం మత పెద్దలతో మహా ప్రవక్త జన్మదినం ప్రవచనం, అన్నదాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 524.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 7,938, ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 854.80 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయానికి జూరాల నుంచి 7,834, రోజా నుంచి 4,446 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 3,007 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 800 క్యూసెక్కులు వదిలారు.

పోషణ వెరీగుడ్డు

- రక్తహీనత నివారణకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ
- గర్భిణులు, బాలింత, చిన్నారులకు మేలు
- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అమలు
- జిల్లాలో 3.78 కోట్ల కోడి గుడ్లు పంపిణీ



దుర్గి మండలం ముటుకూరు అంగన్‌వాడీ సెంటర్‌లో లబ్ధిదారులకు కోడిగుడ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

సాక్షి, నరసరావుపేట: ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం శ్రద్ధ పెట్టింది. ప్రాథమిక స్థాయి నుంచే చర్యలు చేపట్టింది. అందులో భాగంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తోంది. అందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని తగ్గించేందుకు కృషి చేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషక పదార్థాలను అందజేస్తోంది. ఏ ఒక్కరిలోనూ పోషకాహార లోపం తలెత్తకుండా అవసరమైన అన్ని రకాల పదార్థాలను నాణ్యతతో అందిస్తున్నారు. పక్కాగా వారంలో ప్రతి రోజు ఏ మెనూ ఉండాలో ముందుగా ప్రకటించి, దాని ప్రకారం అమలు చేస్తున్నారు. అందులో భాగంగా అధిక పోషకవిలువలు ఉన్న కోడిగుడ్డును అధిక ప్రాధాన్యంతో అందజేస్తున్నారు. పల్నాడు జిల్లాలో మొత్తం 2,010 మెయిన్, 21 మినీ కలిపి మొత్తం 2,031 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 1,26,244 మంది లబ్ధిదారులు ఉన్నారు.

సంపూర్ణ పోషణ కిట్

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో పోషక విలువలతో కూడిన సంపూర్ణ ఆరోగ్యం ముఖ్యమైనది. ఇందులో భాగంగా ప్రభుత్వం పోషక విలువలు అధికంగా ఉండే పాలు, కోడిగుడ్డు, బాలామృతం, రాగిపిండి, బెల్లం, వేరుశనగ చిక్కీ, ఎండు ఖర్జూరం, సజ్జ/జొన్న పిండి, అటుకులు పంపిణీ చేస్తున్నారు. కేంద్రాలలో ఆకుకూరలు, పప్పులు, కూరగాయలతో కూడిన భోజనం పెడుతున్నారు.

ఏడాదికి 3.78 కోట్ల గుడ్ల పంపిణీ

జిల్లాలో 2,031 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో మొత్తం 1,26,244 మంది చిన్నారులు, బాలింతలు, గర్భిణులున్నారు. వారందరికీ నెలకు ఒక్కొక్కరికి సగటున 25 కోడిగుడ్లను పంపిణీ చేస్తున్నారు. దీంతో నెలకు 31,56,100 కోడిగుడ్లను అంగన్‌వాడీ కేంద్రాల నుంచి లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు. గత ప్రభుత్వంలో 3 నుంచి 6 ఏళ్ల చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు సగటున 16 కోడిగుడ్లు, ఆరు నెలల నుంచి 3 ఏళ్ల చిన్నారులకు 8 చొప్పున గుడ్లను అందజేసేవారు.

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కోడిగుడ్ల పంపిణీ

కేటగిరి	లబ్ధిదారుల సంఖ్య	నెలకు ఇచ్చే సంఖ్య
గర్భిణులు	13,182	3,29,550
బాలింతలు	13,691	3,42,275
3 ఏళ్లలోపు చిన్నారులు	66,078	16,51,950
3-6 ఏళ్ల మధ్య	33,293	8,32,325
మొత్తం	1,26,244	31,56,100

జగనన్నకు కృతజ్ఞతలు



అంగన్‌వాడీ కేంద్రం మధ్యాహ్న భోజనం మెనూలో ఆరోగ్యకరమైన, అధిక పౌష్టిక విలువలు కలిగిన ఆహారం ఇస్తున్నారు. సంపూర్ణ పోషణ కిట్‌లో రాగి పిండి, జొన్న పిండి, అటుకులు, ఎండు ఖర్జూరం, చిక్కీ, పాలు, కోడిగుడ్లు ఉంటున్నాయి. కేంద్రంలోనే భోజనం చేస్తున్నాం. పంపిణీలో పారదర్శకత కనిపిస్తోంది. మా ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటున్న జగనన్నకు కృతజ్ఞతలు. – లక్ష్మీ ప్రసన్న, ధర్మవరం, దుర్గి మండలం

మెరుగైన పోషకాహారం



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద మెరుగైన పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను అందిస్తున్నాం. నాణ్యమైన కోడిగుడ్లను ఎక్కువ సంఖ్యలో పంపిణీ చేస్తున్నాం. సరుకు గోడౌన్‌కు వచ్చింది మొదలు, లబ్ధిదారులకు చేరే వరకు సాంకేతిక నిఘా ఉంది. దీని వల్ల పౌష్టికాహార సరఫరాలో లోపాలు దాదాపుగా సమసిపోయాయి. రక్తహీనత సమస్యను నివారించేలా చూస్తున్నాం. –ఎల్.శివశంకర్, కలెక్టర్, పల్నాడు జిల్లా

జై జవాన్ గోపరాజు

- గుండెపోటుతో మరణించిన వీర సైనికుడు
- పార్థివ దేహాన్ని లాంఛనాలతో పల్లెకోనకు తరలించిన ప్రభుత్వం
- నేడు అంత్యక్రియలు



పురమా గోపరాజు(ఫైల్)

భట్టిప్రోలు: బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలు మండలం పల్లెకోనకు చెందిన జవాన్ పురమా గోపరాజు (26) సోమవారం రాజస్థాన్‌లోని పాకిస్తాన్ బోర్డర్ జస్సల్‌మీర్ వద్ద విధి నిర్వహణలో ఉండగా గుండెపోటుకు గురై మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయన పార్థివదేహాన్ని మంగళవారం సికింద్రాబాద్ మిలటరీ హాస్పిటల్‌కు తరలించారు. బుధవారం తెలంగాణ ప్రభుత్వం తరపున అక్కడి ఐఏఎస్, మిలటరీ అధికారులు గోపరాజు పార్థివదేహానికి నివాళి అర్పించారు. ఏపీ ప్రభుత్వం తరపున భట్టిప్రోలు మేజిస్ట్రేట్, తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జ్ ఆర్ఐ శివరామకృష్ణ సికింద్రాబాద్ వెళ్లి అక్కడి కార్యక్రమాల్లో పాల్గొని గోపరాజు భౌతికకాయాన్ని ప్రత్యేక వాహనంలో బుధవారం సాయంత్రం స్వగ్రామమైన పల్లెకోనకు తీసుకువచ్చారు. భట్టిప్రోలు నుంచి పల్లెకోన గ్రామస్తులు గోపరాజు పార్థివ దేహం వెంట ర్యాలీగా స్వగ్రామానికి వెళ్లారు. అమర్ రహే గోపరాజు అంటూ నినాదాలు చేశారు. గోపరాజు భౌతిక కాయం వెంట మిలటరీ కెప్టెన్ రిషబ్ సూద్, జూనియర్ కమిషనర్ ఆఫీసర్లు (జేసీవోలు) కురేష్, సుభాష్‌చంద్ర, గురవ్, పల్లిబాబు, మరో 25 మంది వివిధ విభాగాలకు చెందిన జవాన్లు వచ్చారు. గురువారం ఉదయం సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు జరగనున్నట్లు గ్రామ సర్పంచ్ బొల్లెద్దు రాజమ్మ ప్రతాప్, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శేరు శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు దున్నా తిరుపతిబాబు తెలిపారు.

గోసంరక్షకుడిగా గోవింద నారసింహుడు



మంగళగిరి: నగరంలో వేంచేసి వున్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి పవిత్రోత్సవాల ముగింపులో భాగంగా బుధవారం రాత్రి స్వామివారు గోవింద నారసింహుడు గోసంరక్షకుడి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గోసంరక్షకుడి అలంకరణలో శ్రీదేవి భూదేవి సమేతుడై శ్వేత పుష్పరథంపై గ్రామోత్సవానికి తరలివెళ్లారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ముగిసిన నృసింహుని పవిత్రోత్సవాలు

శ్రీ లక్ష్మీనృసింహస్వామి పవిత్రోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. నాలుగు రోజుల పాటు వైభవంగా నిర్వహించి ఉత్సవాలు పూర్ణాహుతితో ముగిశాయి. ఉదయం నిత్యహోమం, ఉక్త హోమాలు, పూర్ణాహుతి, కుంభ జలప్రోక్షణ, మహదాశీర్వచనం, సాయంత్రం శ్వేత పుష్పాలంకరణతో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలను ఆలయ ఈవో ఏ. రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

తక్షణ పరిష్కారమే 'జగనన్నకు చెబుదాం' లక్ష్యం



కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న పల్నాడు కలెక్టర్ శివశంకర్

కలెక్టర్ శివశంకర్ లోతేటి



ఫిర్యాదులను రిజిస్టర్ చేయించుకుంటున్న ప్రజలు

యడ్లపాడు: ప్రజల సమస్యలు వేగంగా పరిష్కరించడమే 'జగనన్నకు చెబుదాం' లక్ష్యమని పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి చెప్పారు. యడ్లపాడు టీటీడీ కల్యాణ మండపంలో అధికారులు బుధవారం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు జేసీ ఎ.శ్యామ్‌ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్పనశ్రీ, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు కలెక్టర్, జాయింట్ కలెక్టర్లకు అర్జీలు అందజేశారు. మొత్తం 28 వినతులు వచ్చాయి. వీటిలో ఒకటి హౌసింగ్‌శాఖ బిల్లుకు సంబంధించింది కాగా మిగిలినవన్నీ రెవెన్యూ శాఖకు చెందినవే. ముందుగా పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలను, అలాగే అంగన్‌వాడీల్లో అందించే పోషకాహారం, బాలబడి విద్య విషయాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

జవాబుదారీ కోసమే

అధికారుల్లో జవాబుదారీతనం పెంచడమే జగనన్నకు చెబుదాం కార్యక్రమం ముఖ్య లక్ష్యమని కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. ప్రజలు కలెక్టరేట్‌కు రాకుండా కూడా 1902కు ఫోన్ చేసి తమ సమస్యలను వివరించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి పి.రాధారాణి, ఎంపీపీ పి.ఝాన్సీ, సర్పంచ్ కె.హేమ, ఆర్డీఓ శేషిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ బి.బాలునాయక్, డ్వామా పీడీ జోసఫ్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవి, డీఎస్ఓ పద్మశ్రీ, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి వెంకటేశ్వర్లు, ట్రైబల్ వెల్ఫేర్ జిల్లా అధికారి వరలక్ష్మి, డీసీహెచ్ఎస్ బీ.రంగారావు, డీఎల్‌డీఓ వెంకటరెడ్డి, డీఎస్‌డబ్ల్యూ డీడీ మహాలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ అరుణ, పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, మైనర్ ఇరిగేషన్ జిల్లా అధికారి ఆంజనేయులు, సోషల్ వెల్ఫేర్ డీడీ ఓబుల్‌నాయుడు, తహసీల్దార్ జి. సుజాత, డీటీ శ్యామలత, ఎంపీడీఓ వై.హనుమారెడ్డి, ఈవోపీఆర్డీ వరూధిని పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ముల దుర్మరణం

ఒకరికి తీవ్రగాయాలు





మృతులు చిన్న ఏడుకొండలు, ముసలయ్య

వినుకొండ(నూజెండ్ల): రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు దుర్మరణం పాలయ్యారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాద ఘటన వినుకొండ రూరల్ మండలం కొత్తపాలెం సమీపంలో గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నీలగంగవరం గ్రామానికి చెందిన మర్రి చిన్న ఏడుకొండలు (26), మర్రి ముసలయ్య (24) అన్నదమ్ములు. వీరు కొంతకాలంగా వినుకొండలో పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరిద్దరూ మంగళవారం రాత్రి పెద్ద ఏడుకొండలుతో కలిసి రెండు ద్విచక్రవాహనాలపై స్వగ్రామంలోని ఓ శుభకార్యానికి వెళ్లి వస్తుండగా ఎదురుగా వచ్చిన ఫోర్ వీల్ ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిన్న ఏడుకొండలు, ముసలయ్య అక్కడికక్కడే మరణించారు. పెద్ద ఏడుకొండలుకు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు. ఒకే కుటుంబంలో ఇద్దరు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలను చూసేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి తరలివచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వహ్వా వహిదా.. తెనాలి ఫిదా

- తెనాలితోనూ మహానటికి అనుబంధం
- ఇక్కడే చదువుకున్న అలనాటి అందాల తార
- ఆంధ్రాప్యారిస్‌లో నర్తించిన సినీ మయూరి
- గుర్తుచేసుకుంటున్న స్థానికులు



తెనాలి: సినీ రంగంలో లబ్ధప్రతిష్టులైన కళాకారులకు భారత ప్రభుత్వం అందించే సర్వోన్నత పురస్కారం దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును 2021 సంవత్సరానికి స్వీకరించనున్న ప్రసిద్ధ బాలివుడ్ నటి వహిదా రెహమాన్ తెలుగు చిత్రసీమ నుంచే బాలివుడ్‌కు వెళ్లారు. విశాఖపట్టణంలో పెరిగిన వహిదా, అక్కణ్నుంచే సినీరంగానికి పరిచయమయ్యారు. అయితే అందరికీ తెలీని విషయం ఏమిటంటే ఆమెకు ఆంధ్రాప్యారిస్ తెనాలితోనూ అనుబంధం ఉంది. విశాఖకు ముందు ఆమె తన తల్లిదండ్రులతోపాటు కొద్దికాలం తెనాలిలో ఉన్నారు. నాట్యం నుంచి ఆమె తెరంగేట్రం చేసినందున, ఆ నాట్యకళకు శ్రీకారం చుట్టింది కళల తెనాలిలోనే అని పెద్దలు చెబుతారు.

వహిదా తండ్రి మున్సిపాలిటీ అధికారి

వహిదా తండ్రి రెహమాన్ పట్టణ మున్సిపాలిటీలో అధికారిగా కొంతకాలం పని చేశారు. అందుచేత వహిదా కొత్తపేటలోని తాలూకా హైస్కూలులో చదువుకున్నారు. అప్పట్లోనే ఆమె నాట్యం నేర్చుకుని ఉంటుందని, తనకు ఆమె బ్యాచ్‌మేట్ అని సీనియర్ కళాకారుడు, 'నూరేళ్ల తెనాలి రంగస్థలి' గ్రంథకర్త స్వర్గీయ నేతి పరమేశ్వరశర్మ చెప్పేవారు. ఆ తర్వాత ఆమె తండ్రికి విజయవాడకు బదిలీ అయింది. అక్కడకు వెళ్లాక కూడా వహిదా నాట్య సాధన కొనసాగించింది. పట్టణానికి చెందిన రాజకీయ నాయకుడు, కళాభిమాని, కళాపోషకుడు నన్నపనేని వెంకట్రావు అప్పట్లో ఆంధ్ర నాటక కళాపరిషత్ పోటీలను స్వరాజ్ టాకీస్‌లో నిర్వహించేవారు. ఒకరోజు వహిదా రెహమాన్ నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆ ప్రదర్శన తిలకించిన వారిలో తానూ ఒకణ్ణని పరమేశ్వర శర్మ సంతోషపడేవారు.

ప్రేక్షకుల మది గెలిచిన నటి

తర్వాత వహిదా తాపీ చాణక్య తీసిన 'రోజులు మారాయి' సినిమాతో వెండితెరపై మెరిశారు. 'ఏరువాక సాగారో' పాటకు అద్భుతంగా నృత్యం చేశారు. ప్రజా నాట్యమండలి డప్పు కళాకారులు అమృతయ్య, ఏసుదాసులే ఆ పాటకు డప్పు వాయించారు. ఆ సినిమా ఎంత హిట్టయిందో తెలిసిందే. రోజులు మారాయి సినిమా శతదినోత్సవం తెనాలిలో జరిగినప్పుడు ఆ సినిమా హీరో అక్కినేని నాగేశ్వరరావు, వహిదా రెహమాన్ ఇద్దరూ తెనాలి వచ్చారు. అక్కినేనితోపాటు వహిదాకు తెనాలికి దగ్గర్లోని సంగంజాగర్లమూడిలో ఒక ఇంట్లో బస ఏర్పాటుచేశారు. తెనాలిలో అయితే ప్రేక్షకుల తాకిడి తట్టుకోలేమని నిర్వాహకులు భావించారు. అయినా విషయం తెలుసుకున్న ప్రేక్షకులు అనేకమంది ఆ ఇంటిని చుట్టుముట్టారట. దీంతో బసచేసిన భవనంపై నుంచి అక్కినేని, వహిదా ప్రేక్షకులకు అభివాదం చేశారని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ, 'యోగాచార్య' షేక్ మొహిద్దీన్ బాచ్చా ఒక సందర్భంలో చెప్పారు. చేబ్రోలులో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తాను, బిల్లులు మార్చుకునే నిమిత్తం తెనాలి వస్తుండగా మార్గమధ్యంలో సంగంజాగర్లమూడిలో నాగేశ్వరరావు, వహిదాను చూశానని వివరించారు. తెలుగు తెర నుంచే బాలివుడ్‌కు వెళ్లిన వహిదా అక్కడ ఓ వెలుగు వెలిగారు. తన అందంతోనే కాకుండా నాట్యంతో ప్రేక్షక హృదయాలు గెలుచుకున్నారు. భారత ప్రభుత్వం నుంచి పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డులను స్వీకరించారు. మళ్లీ ఇప్పుడు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ఆమె కీర్తి సిగలో కలికితురాయి కానుంది.

ఆహ్లాదం, ఆరోగ్యం కోసమే నగర వనాల అభివృద్ధి

టెంపుల్ హిల్ ఏకో పార్కును ప్రారంభించిన రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పార్కు శిలాఫలకాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, చిత్రంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు

మంగళగిరి: ప్రజలకు ఆహ్లాదంతోపాటు ఆరోగ్యాన్ని అందించేలా నగర వనాలను అభివృద్ధి చేస్తున్నట్టు రాష్ట్ర విద్యుత్, పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, మైన్స్ అండ్ జియాలజీ శాఖల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. నగరంలోని ఎయిమ్స్ ఆస్పత్రి సమీపంలో సుమారు 20 హెక్టార్ల విస్తీర్ణంలో అటవీ శాఖ నిర్మించిన టెంపుల్ హిల్ ఏకో పార్కును బుధవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి ప్రారంభించారు. ఏకో పార్కులో ఏర్పాటు చేసిన ముఖద్వారం, పిల్లలు ఆడుకునే స్థలం, వాకింగ్ ట్రాక్, విశ్రాంత గది, సిట్టింగ్ బెంచ్‌లు, ఓపెన్ జిమ్, యోగా సెంటర్, పిల్లల అడ్వెంచర్ ప్లే జోన్, కొండపైకి వెళ్లే ట్రెక్కింగ్ ట్రాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ పార్కును ఆహ్లాదంగా తీర్చిదిద్దడంలో ఎమ్మెల్యే ఆర్కే కృషి అభినందనీయమన్నారు. వినూత్నంగా పట్టణాలకు దగ్గరలో ఉన్న అటవీ ప్రాంతంలో ఆహ్లాదకర నిర్మాణాలు చేసి వాటికి నగర వనాలు అని పేరు పెట్టినట్టు వివరించారు. రాష్ట్రంలో మొదలు పెట్టిన నగరవనాలన్నింటినీ వచ్చే ఎన్నికలలోపు పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామన్నారు. రాష్ట్రంలోనే తొలిసారి ఎమ్మెల్యే ఆర్కే నియోజకవర్గంలో పూర్తి చేసుకున్న నగరవనాన్ని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం పార్కులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో రాష్ట్ర అటవీ దళాల అధిపతి వై.మధుసూదన్‌రెడ్డి, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వై శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జిల్లా అటవీశాఖ అధికారి మహబూబ్ బాషా, ఎంటీఎంసీ కమిషనర్ యు.శారదాదేవి, అటవీ శాఖ ఉన్నతాధికారులు ఏకే నాయక్, ఆర్‌పీ ఖజరియా, ఏకేయూ శాంతి ప్రియా పాండే, రాహుల్ పాండే, గోపినాథ్, తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, దుగ్గిరాల ఎంపీపీ సంతోష రూపవాణి, జెడ్పీటీసీ మేకతోటి అరుణ, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, మంగళగిరి పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, వైఎస్సార్ సీపీ తాడేపల్లి రూరల్ అధ్యక్షుడు మున్నంగి వివేకానంద రెడ్డి, దుర్గగుడి సలహాదారుడు జెక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ మేకా వెంకటరామిరెడ్డి, మహిళా నాయకులు సంకె సునీత, మల్లవరపు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎంఏ ఇంటర్, ఫైనల్‌లో శ్రీమేధ ప్రభంజనం



గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) మంగళవారం ప్రకటించిన సీఎంఏ ఇంటర్, ఫైనల్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థులు అఖిల భారతస్థాయిలో ర్యాంకులు సాధించినట్లు శ్రీమేధ చైర్మన్ అన్నా నంద కిషోర్ తెలిపారు. కొత్తపేటలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో నంద కిషోర్ మాట్లాడుతూ గత 18 ఏళ్లుగా సీఏ, సీఎంఏ కోర్సుల్లో 400లకు పైగా అఖిల భారత స్థాయి ర్యాంకులు సాధించామని తెలిపారు. తాజాగా విడుదలైన ఫలితాల్లో సీఎంఏ ఇంటర్ విభాగంలో వంగల అశోక్‌రెడ్డి అఖిల భారతస్థాయిలో 4వ ర్యాంకు, సీఎంఏ ఫైనల్‌లో వేజెండ్ల సాయిరామ్ 17వ ర్యాంకు, అడ్డగర్ల రమ్యశ్రీ 18వ ర్యాంకు, చేబ్రోలు అభిషేక్ 18వ ర్యాంకు సాధించినట్లు వివరించారు. ఇంటర్మీడియెట్ నుంచి సీఏ, సీఎంఏ కోర్సులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులచే క్రమశిక్షణతో కూడిన శిక్షణ అందించడం ద్వారా తమ విద్యార్థులు అఖిల భారతస్థాయిలో టాప్ ర్యాంకులు సాధించారని చెప్పారు. ఈ ఘనత సాధించడంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సహకారం ఎంతో ఉందన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను శ్రీమేధ చైర్మన్ నందకిషోర్, డైరెక్టర్ అన్నా శ్రీలక్ష్మి అభినందించారు.

సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల ఆశీస్సులు

జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు



మాట్లాడుతున్న అంబటి రాంబాబు వేదికపై హోం మంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యే శంకరరావు తదితరులు

అచ్చంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి భగవంతుని ఆశీస్సులు, ప్రజలు అండదండలు మెండుగా ఉన్నాయని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. అచ్చంపేటలో రూ.2.50 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్ భవన ప్రారంభోత్సవం బుధవారం నిర్వహించారు. హోం మంత్రి తానేటి వనితతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. మంత్రి రాంబాబు మాట్లాడుతూ త్వరలో ఎన్నికలు సమీపిస్తున్నాయని, కార్యకర్తలు సిద్ధం ఉండాలని పిలుపునిచ్చారు. 175 స్థానాలను సొంతం చేసుకోవడం ఏమాత్రం అసాధ్యం కాదని పేర్కొన్నారు. సినీ నటుడు పవన్‌కళ్యాణ్ కూడా చంద్రబాబు పొత్తులోని దత్తపుత్రుడేనన్నారు. ప్రధాన మంత్రినైనా జైలుకు పంపే గొప్ప న్యాయవ్యవస్థ మనకు ఉందని చెప్పారు. అందుకు తప్పుచేసిన ఎవరైనా అతీతులు కాదన్నారు. హైకోర్టు, సుప్రీం కోర్టుల మెట్లు ఎన్ని ఎక్కినా చంద్రబాబు బయటకు రాలేడన్నారు. సమావేశానికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అధ్యక్షత వహించారు. హోంమంత్రి మాట్లాడుతూ మహిళా సాధికారితకోసం, వారి ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు 33 లక్షల ఇళ్ల స్థలాలను పంపిణీ చేసిన ఘనత సీఎం జగన్‌మోహనరెడ్డిదేనన్నారు. గతనాలుగున్నరేళ్లలో పేదరికం 12శాతం నుండి 6 శాతానికి పడిపోయిందన్నారు. ప్రతిపక్షాలు ఓర్వలేక బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నీటివంతుడైతే ఆయన పీఏ శ్రీనివాస్, స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ గంటా సుబ్బారావు ఎందుకు పరారైనాడని, లోకేష్ ఢిల్లీలోనే ఎందుకు మకాం వేశాడని ప్రశ్నించారు. సభకు అధ్యక్షత వహించిన నంబూరు శంకరరావు మాట్లాడుతూ రూ.650కోట్లతో సంక్షేమాభివృద్ధి పథకాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి అనుమానితులను గుర్తించండి

నరసరావుపేట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న సర్వేలో కుష్ఠువ్యాధి అనుమానితులను గుర్తించి వ్యాధి గ్రస్తులను నిర్ధారించాలని జిల్లా క్షయ, టీబీ, లెప్రసీ వ్యాధి నిరోధక అధికారి డాక్టర్ కె.పద్మావతి ఆదేశించారు. లెప్రసీ ఎరాడికేషన్ కార్యక్రమంలో తన కార్యాలయంలో నిర్వహించిన నెలవారి సమావేశంలో డెప్యూటీ పారా మెడికల్ అధికారుల పనితీరుని సమీక్షించారు. నూతనంగా కనుగొన్న లెప్రసీ కేసు లకీ ఎఫ్ఎల్‌సీ సర్వే చేసి అనుమానితులని నిర్ధారించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షను అందరూ ఉపయోగించుకొని వ్యాధిగ్రస్తులు తక్కువ అయ్యేలా చూడాలని పేర్కొన్నారు. శరీరం మీద రంగు మారిన మచ్చలు, కాళ్లు చేతులలో పుండ్లు, అంగవైకల్యం ఉంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చూపించుకోవాలని ప్రజలకు అవగాహన కలిగించాలని కోరారు. మచ్చ రూపంలో ఉన్నప్పుడే వ్యాధిని నిర్ధారించి చికిత్స తీసుకుంటే వ్యాధి పూర్తిగా నయమవుతుందని అంగవైకల్యం రాకుండా చూసుకోవచ్చని వివరించారు.

నేడు తైక్వాండో జిల్లా జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక బీఆర్ స్టేడియంలో జిల్లా జట్టు ఎంపిక నిర్వహిస్తామని జిల్లా కార్యదర్శి కె.జగన్మోహనరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్స్ నుంచి సీనియర్స్ విభాగాల్లో పోటీలుంటాయన్నారు. ఎంపికైన జట్టును వచ్చే నెల వైఎస్సార్ కడప జిల్లాలో జరగనున్న రాష్ట్ర పోటీలకు పంపిస్తామన్నారు.

రైతులకు సబ్సిడీపై విత్తనాలు

- జిల్లా కలెక్టర్ శివశంకర్
- అధిక దిగుబడులు సాధించిన అభ్యుదయ రైతులకు ఘన సన్మానం



సన్మానించిన అభ్యుదయ రైతులతో జిల్లా కలెక్టర్ శివశంకర్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ

నరసరావుపేట: ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో రైతులు పంటలు వేసేందుకు కావాల్సిన విత్తనాలను సబ్సిడీపై అందజేయాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. వ్యవసాయాధికారులు, సలహా మండలి సభ్యులు, రైతులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంట పొలాలను ఖాళీగా ఉంచకుండా ప్రత్యామ్నాయ పంటలు వేయాలని సూచించారు. ప్రతి మండలంలో ఐదురకాల విత్తనాలతో డ్రాట్ ప్రూఫ్ మోడల్‌లో రెండెకరాల్లో నమూనా సాగు చేయాలని కోరారు. జిల్లాలో అర్హులైన కౌలుదారులందరూ బ్యాంకు రుణాలు పొందేలా ఆయా బ్యాంకర్లతో మాట్లాడి రుణాలు ఇప్పించాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. చైర్మన్ మార్కొండారెడ్డి మాట్లాడుతూ రైతులకు సూక్ష్మబిందు సేద్యంపై అవగాహన కల్పించి చిరుధాన్యాలు పండించే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. సంప్రదాయ, ఆర్గానిక్ ఎరువులతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించిన అభ్యుదయ రైతులను రైతుకు వందనం కార్యక్రమం క్రింద ఘనంగా సన్మానించారు. ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, వ్యవసాయ, ఉద్యాన శాఖల జిల్లా అధికారులు ఐ.మురళి, బీజే బెన్నీ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక



ఎంపికైన బాలబాలికల జట్టుతో ఉపాధ్యాయులు

సత్తెనపల్లి: ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -19 బాల, బాలికల జిల్లా ఫుట్‌బాల్ జట్ల ఎంపికలు ప్రగతి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో స్థానిక సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రగతి కళాశాల డైరెక్టర్ పరిటాల నరేష్, వృందా కళాశాల డైరెక్టర్ జి.అనూష, ప్రగతి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.శ్రీనివాసరావు హాజరయ్యారు. ఎంపికల కార్యక్రమాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు వై.ఉదయభాస్కర్, యస్.సుధాకర్ రెడ్డి,,ప్రగతి జూనియర్ కళాశాల గంపా శ్రీను, ఫిజికల్ డైరెక్టర్‌లు నరసింహారావు, పి.శివరామకృష్ణ పాల్గొన్నారు.

ఎంపికయిన జట్లు అక్టోబర్ మొదటి వారంలో చిత్తూరు జిల్లాలో జరిగే 67వ ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల పోటీలలో పాల్గొంటారని గుంటూరు జిల్లా అండర్-19 జాయింట్ సెక్రటరీ వై.ఉదయభాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు లాకు పిచ్చయ్య, బి.అనీల్ దత్తానాయక్, కె.కిరణ్, ఎస్.సురేష్, షేక్ కరిముల్లా, ముప్పా నరసింహారావు, పెనుమాక వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాలుర జిల్లా జట్టు: షేక్ మస్తాన్ వలి, సయ్యద్ ఖాజా పీరా, ఎ.గోపీ సందీప్, యస్.శ్రీకాంత్, కె.నాగరాజు, జి.కౌషిక్, బి.మోషే, ఎం.ముఖేష్, షేక్ నాగ నజీర్, పి.నరసింహా, ఎస్.మణికంఠ శ్రీనివాస రెడ్డి, బి.హనుమంత నాయక్, వి.విజయ్, సయ్యద్ రవూఫ్, షేక్ నాగూర్ షరీఫ్, జె.మోషే, బి.రవీంద్ర, పి.చంద్రశేఖర్, స్టాండ్ బైగా పి.వెంకటేష్, ఐ.రవీంద్ర, బి.చరణ్, జె.మోషేరాజు, ఆర్.అమరనాథ్ ఎంపికయ్యారు.

బాలికల జట్టు: ఎం.జ్యోతి, పి.భూమిక, సి.హెచ్.అర్చన, పి.సాయి వెంకట హరిప్రియ, జె.శ్రీవల్లి, జి.సౌజన్య, ఎం.పవిత్రపావని, టి.రజని, ఎన్.రమ్య, కె.రమ్య, పి.రమ్యశ్రీ, కె.నేహా, కె.దుర్గా కోమలి, కె.సాయి రూప, కె.హేమా రాజేశ్వరి, పి.విష్ణు ప్రియ, డి.ప్రవల్లిక, టి.రమాదేవి, స్టాండ్ బైగా టి.నౌమిక, కె. సుమిత్ర, కె.నీలిమ, కె.మమిత, సి.హెచ్.రూపశ్రీ ఎంపికయ్యారు.

ఆశాజనకంగా వర్షాలు

కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు జిల్లాలో ఆశాజనకంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు అత్యధికంగా మేడికొండూరు మండలంలో 72 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా మంగళగిరి మండలంలో 2.4 మి.మీ వర్షం పడింది. సగటున 23 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి... ఫిరంగిపురం 66.6, పొన్నూరు 54.2, కాకుమాను 39.4, తుళ్ళూరు 38.6, తాడికొండ 29.2, వట్టిచెరుకూరు 25.2, పెదకాకాని 23.4, గుంటూరు పశ్చిమ 19, గుంటూరు తూర్పు 17.6, చేబ్రోలు 9.8, దుగ్గిరాల 7.2, ప్రత్తిపాడు 6.2, పెదనందిపాడు మండలంలో 3.2 మి.మీ చొప్పున వర్షం పడింది. సెప్టెంబర్ మాసం 27వ తేదీ వరకు సాధారణ వర్షపాతం 126.5 మి.మీ పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 210.6 మి.మీ వర్షపాతం నమోదైంది. మరో మూడు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

1న జూనియర్ ఖో-ఖో జట్ల ఎంపిక

నకరికల్లు: నరసరావుపేటలోని శంకరభారతీపురం ఉన్నత పాఠశాలలో అక్టోబరు 1న ఉమ్మడి గుంటూరు జిల్లా జూనియర్ ఖో-ఖో జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి చింతా పుల్లయ్య బుధవారం తెలిపారు. ఎంపికైన జట్లు అక్టోబర్ 20 నుంచి 22వ తేదీ వరకు చిత్తూరు జిల్లా యాదమరిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. సెలక్షన్స్‌లో పాల్గొనే బాలబాలికలు 2006 జనవరి 1న గాని ఆ తర్వాత పుట్టినవారై ఉండాలన్నారు. సెలక్షన్స్‌లో పాల్గొనే వారు కచ్చితంగా వయసు ధ్రువీకరణ పత్రం తీసుకొని రావాలని సూచించారు. వివరాలకు జి.ఝాన్సీరాణి, ఫిజికల్ డైరెక్టర్, నరసరావుపేట, సెల్: 9949533234లో సంప్రదించాలని కోరారు.

ఏరియా వైద్యశాలను సందర్శించిన వైద్యుల బృందం



సదుపాయిలపై ఆరా తీస్తున్న కేంద్ర బృందం

సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాలను కేంద్ర ప్రభుత్వ ప్రతినిధుల బృందం బుధవారం సందర్శించింది. ముస్కాన్ నేషనల్ అసెస్మెంట్ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా ఇరువురు సభ్యులతో కూడిన బృందం వైద్యశాలలోని చిన్నపిల్లల వార్డు, చిన్న పిల్లలు ఓపీ స్టేషన్, ప్లే ఏరియా, నవజాత శిశువు కేంద్రం క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతినిధుల బృందంలో ప్రతిమ్మ ప్రభ గుహ, రజీనా రాణి వైద్యశాల మొత్తం పరిశీలించి ముస్కాన్ కార్యక్రమానికి అవసరమైన వసతులు అన్నీ ఉన్నాయా లేదా అని విచారించి నివేదిక తయారు చేశారు. నూతనంగా అభివృద్ధి చేసిన పిల్లల వార్డుని పరిశీలించారు. ఇక్కడ అందుతున్న సేవలు, సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్రం నుంచి వచ్చిన బృందం ఎంతో సంతృప్తి వ్యక్తం చేశారని, ముఖ్యంగా అభివృద్ధి కమిటీ మెంబర్స్ బాగా చురుగ్గా ఉండటం వల్ల సరైన వసతులు అందుతున్నాయని కేంద్ర కమిటీ సభ్యులకి వివరించారు. కార్యక్రమంలో ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ పాల్గొన్నారు.

రూ.14.29 లక్షల విలువైన కందిపప్పు స్వాధీనం



కందిపప్పు నిల్వలు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

చిలకలూరిపేట: నిబంధనలకు విరుద్ధంగా కందిపప్పును నిల్వ చేసిన దాల్ మిల్‌పై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం దాడి చేశారు. వివరాలు.. గుంటూరు రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో అధికారులు పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని శ్రీలక్ష్మి శ్రీనివాస దాల్‌మిల్‌ను తనిఖీ చేశారు. లీగల్ మెట్రాలజీ అధికారులతో కలసి నిర్వహించిన ఈ దాడిలో స్టాక్ రిజిస్టర్‌లో నిల్వల కన్నా ఎక్కువ వ్యత్యాసాన్ని ఉన్నట్లు గుర్తించారు. రిజిస్టర్‌లో చూపిన దానికన్నా రూ.14.29 లక్షలు విలువ చేసే కందిపప్పు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. నిత్యావసరాల చట్టం 6ఏ కింద కేసు నమోదు చేసి సంబంధిత సరకును స్వాధీనం చేసుకోవాలని సివిల్ సప్‌లెస్తై డెప్యూటీ తహసీల్దార్‌ను అధికారులు ఆదేశించారు. దీంతో పాటు లీగల్ మెట్రాలజీ అధికారులు లీగల్ మెట్రాలజీ చట్టం 2009 ప్రకారం నిబంధనలను ఉల్లంఘించినందుకు కేసు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎస్ శ్రీనివాసులు రెడ్డి, తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్తమ టూరిస్ట్ ఫ్రెండ్లీ రైల్వేస్టేషన్‌గా గుంటూరు

మంత్రి రోజా చేతుల మీదుగా అవార్డు అందుకున్న సీనియర్ డీసీఎం



మంత్రి ఆర్.కె. రోజా చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న డీసీఎం దినేష్‌కుమార్

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): గుంటూరు రైల్వే స్టేషన్‌ను నూతన ఆధునిక పద్ధతిలో సదుపాయాలను కల్పిస్తు సుందరీకరించడంలో ముందజంలో ఉన్నందున రైల్వే స్టేషన్‌కు ఉత్తమ టూరిస్ట్ ఫ్రెండ్లీ రైల్వే స్టేషన్ అవార్డును అందజేయడం చాలా సంతోషదాయకంగా ఉందని డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె. రోజా చేతుల మీదుగా అవార్డులను బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు రైల్వే డివిజన్‌ను అత్యంత అభివృద్ధి పదంలో నడిపించడంలో డివిజన్ డీఆర్ఎం ఎం.రామకృష్ణ తన దైన శైలీలో చేసిన కృషికి ఫలితంగా ఉత్తమ టూరిస్ట్ ఫ్రెండ్లీ రైల్వే స్టేషన్‌ను దక్కించుకోవడం జరిగిందన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఈ అవార్డును అందుకోవడం చాలా ఆనందదాయకంగా ఉందన్నారు. డివిజన్ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిందిగా తెలిపారు. అలాగే గుంటూరు రైల్వే స్టేషన్‌లో త్వరలో పశ్చిమం వైపు నూతన ప్లాట్‌ఫారాన్ని ఆధునిక పద్ధతిలో ప్రయాణికులకు సదుపాయాలను కల్పిస్తు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా పనులు చేస్తున్నామని వివరించారు. డివిజన్ అభివృద్ధికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం

ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ విలియం కారీ



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ విలియం కారీ

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకమని ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. విలియం కారీ పేర్కొన్నారు. బుధవారం అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ విలియం కారీ ఫార్మాసిస్టుల ప్రాధాన్యత తెలియజేస్తూ విద్యార్థులు, అధ్యాపకులతో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో విలియం కారీ మాట్లాడుతూ ఔషధ శాస్త్రంలో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, త్రీడీ ప్రింటింగ్, ఫార్మకో విజిలెన్స్‌పై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలతో పాటు పోటీ పరీక్షలో గెలపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర కె.రవికుమార్, ఫార్మాస్యూటిక్స్, ఫార్మసీ ప్రాక్టీసు విభాగాధిపతులు డాక్టర్ ఎ. సీతాదేవి, డాక్టర్ ఎస్.హేమకుమారి, డాక్టర్ డి. బ్రహ్మ శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.